క్లుప్తంగా

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంపీ భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీ సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లోని వన్‌టౌన్ సమీపంలో గల మార్వాడి టెంపుల్‌లో రూ.25 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ భవనానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ బుధవారం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రానికి కేంద్రం నుంచి వేల కోట్ల నిధులు వస్తున్నాయని, అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు, మార్వాడి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: రాజస్తాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో ఈ నెల 6 నుంచి 8 వరకు జరగనున్న 42వ జాతీయస్థాయి అండర్– 19 బాలబాలికల షూటింగ్ బాల్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికై నట్లు ఉమ్మడి జిల్లా షూటింగ్ బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ అరిఫ్, ఎండీ మఫజిల్ తెలిపారు. ఇటీవల రాష్ట్ర పోటీల్లో రాణించిన జ్ఞానేశ్వర్, అశ్విత్, శ్రీహిత, అర్షిక ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి తదితరులు అభినందించారు.

బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ ఆర్‌ఎం



ఆర్‌ఎం సుచరితకు మొక్క అందజేస్తున్న భూపతిరెడ్డి

విద్యానగర్: ఆర్టీసీ కరీంనగర్ డిప్యూటీ రీజనల్ మేనేజర్(ఆపరేషన్స్)గా బుధవారం ఎస్.భూపతిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ జోనల్ వర్క్‌షాపు స్టోర్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై వచ్చారు. ఈసందర్భంగా డిప్యూటీ రీజనల్ మేనేజర్ చందర్‌రావు, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, కార్యాలయ సిబ్బంది అభినందించారు. అనంతరం భూపతిరెడ్డి రీజనల్ మేనేజర్ ఎస్.సుచరితను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

మైనారిటీ కమిషన్ సభ్యులకు సన్మానం



సభ్యులను సన్మానిస్తున్న గులాం అహ్మద్ హుస్సేన్

విద్యానగర్: రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులు మహమ్మద్ అత్తరుల్లా, జె.దర్శన్ సింగ్‌లు బుధవారం కరీంనగర్‌లోని ఎంఐఎం కార్యాలయం దారుస్సలాంకు వచ్చారు. వారిని పార్టీ నగర శాఖ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతిలో సాగుపై అవగాహన



విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో బుధవారం ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో 60మంది మహిళారైతులకు ఐదు రకాల కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సొసైటీ కోఆర్డినేటర్ సిస్టర్ దీప్తి మాట్లాడుతూ, రసాయన ఎరువులతో పండించిన కూరగాయలతో అనారోగ్య సమస్యలేర్పడుతాయని పేర్కొన్నారు. సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలను సాగు చేయాలని సూచించారు. సేంద్రియ సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు అరుణ, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, రూప, స్రవంతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రేడియాలజిస్ట్ కావలెను

- రేడియాలజీ హబ్‌లో ముందుకు సాగని సేవలు
- గత మార్చి నుంచి ఇప్పటివరకు ఖాళీగానే పోస్టు
- అందని ద్రాక్షగా అల్ట్రాసౌండ్ 2డీ ఎకో
- ఇబ్బందులుపడుతున్న పేషెంట్లు



తెలంగాణ రేడియాలజీ హబ్



తాళం వేసి ఉన్న అల్ట్రాసౌండ్, 2డీ ఎకో గదులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నోస్టిక్స్ రేడియాలజీ హబ్‌లో రేడియాలజిస్టు పోస్టు భర్తీకి గ్రహణం వీడడం లేదు. నోటిఫికేషన్ ఇచ్చినా ఎవరూ రానటువంటి పరిస్థితి నెలకొంది. దీంతో రేడియాలజిస్టు సేవలు అందడం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య మహిళ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లకు మెమోగ్రామ్, ఎక్స్ రే, ఈసీజీ, అల్ట్రాసౌండ్, 2డీ ఎకో టెస్టులు నిర్వహించేందుకు సుమారు రూ.2.5 కోట్లతో ఈ హబ్‌ను ఏర్పాటు చేశారు. హబ్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం సరిపడా ఉద్యోగుల నియామకం చేయకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈఏడాది మార్చి 8న ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు రేడియాలజీ హబ్‌లో రేడియాలజిస్టు పోస్టు ఖాళీగానే ఉంది. దీంతో రోగ నిర్ధారణ కోసం వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అందుబాటులో లేని టెస్టులు..

రేడియాలజీ హబ్‌లో నిర్వహించాల్సిన అతి ముఖ్యమైన అల్ట్రాసౌండ్, 2డీ ఎకో టెస్టులు జరగడం లేదు. మహిళల్లో క్యాన్సర్ నిర్ధారణే ధ్యేయంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లకు మెమోగ్రామ్ పరీక్ష, ఈసీజీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక రేడియాలజీ హబ్‌కు అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే కోసం వచ్చే పేషెంట్లకు మాత్రం జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఆసుపత్రిలో ఒకే ఒక్క రేడియాలజిస్టు ఉండడంతో తీవ్ర ఒత్తిడి నెలకొంటోంది.

పెరిగిన అల్ట్రాసౌండ్, ఎక్స్‌రేలు..

జిల్లా ఆసుపత్రిలో గతంలో రోజూ 50–60 అల్ట్రాసౌండ్ స్కానింగ్ నిర్వహించగా, రేడియాలజీ హబ్ రావడంతో మరో 30–40 స్కానింగ్‌ల వరకు పెరిగినట్లు తెలిసింది. కాగా ప్రస్తుతం జిల్లా ఆసుపత్రికి, హబ్‌కు వచ్చే పేషెంట్లకు సైతం ఈ పరీక్షలు నిర్వహించాల్సి రావడంతో టెస్టులు చేయడంతో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. దీంతో పేషెంట్లు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. అలాగే ఎక్స్‌రే పరీక్షలు కూడా జిల్లా ఆసుపత్రిలోనే జరుగుతున్నాయి. దీంతో సిబ్బందిపై పని ఒత్తిడితో పాటు ఎక్స్‌రే మిషన్లపై కూడా ప్రభావం పడుతోంది. ఇప్పటికైనా రేడియాలిజిస్టు పోస్టు భర్తీ చేయాలని రోగులు కోరుతున్నారు.

భర్తీ చేస్తాం

తెలంగాణ రేడియాలజీ హబ్‌లో మైక్రోబయాలజీ, అల్ట్రాసౌండ్, 2డీ ఎకో టెస్టుల నిర్వహణ కోసం రేడియాలజిస్టు పోస్టు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చాం. త్వరలోనే పోస్టు భర్తీ చేసి పూర్తి స్థాయి సేవలు అందిస్తాం.

– డాక్టర్ కృష్ణప్రసాద్, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్

బస్తీ దవాఖానాను సద్వినియోగం చేసుకోవాలి

మంత్రి గంగుల కమలాకర్



బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌టౌన్: నగరంలోని 27వ డివిజన్‌లో గల ఆరెపల్లిలో బస్తీ దవాఖానాను బుధవారం బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆరెపల్లి ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు అందించేందుకు బస్తీ దవాఖానాను ఏర్పాటు చేశామని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ దవాఖానాలో గర్భిణుల నమోదు, వ్యాధి నిరోధక టీకాలు, ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. నగర మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్ తుల రాజేశ్వరిబాలయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ లలితాదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జువేరియా తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ సంఘ భవనానికి మంత్రి భూమిపూజ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు రైతువేదిక సమీపంలోని ప్రభుత్వభూమిలో సీడీపీ నిధులు రూ.5లక్షలతో చేపట్టనున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘం భవన నిర్మాణానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, డైరెక్టర్ సాయిల్ల మహేందర్, సర్పంచు ఉప్పుల శ్రీధర్, ఉపసర్పంచు సుంకిశాల సంపత్‌రావు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బుర్ర తిరుపతిగౌడ్, బీఆర్ఎస్ నాయకులు కస్తూరి రాంరెడ్డి, దావు సంపత్, రవితేజ, నేక్‌పాషా, భద్రయ్య, చల్లా లింగారెడ్డి, ఆకుల కిరణ్, నరేశ్, కూర శ్యాంసుందర్‌రెడ్డి, బుచ్చాల కొమురయ్య, ఆర్‌ఎంపీ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లు పంపిణీ



లబ్ధిదారులతో అధికారులు, ప్రజాప్రతినిధులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో బుధవారం ఆరుగురు లబ్ధిదారులకు ప్రభుత్వం సబ్సిడీపై మంజూరు చేసిన గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. ఏపీలోని ఏలూరులో కొనుగోలు చేసిన గొర్రెలను డీసీఎం వ్యాన్‌లో తీసుకొచ్చి స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో పెద్ది ఓదెలు, రవి, సంపత్, చిట్కూరి శేఖర్, రాములు, శేఖర్‌కు బొమ్మకల్ పశువైద్యాధికారి రామకృష్ణ అందించారు. కార్యక్రమంలో సర్పంచు దబ్బెట రమణారెడ్డి, ఉపసర్పంచు శేఖర్, ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్, కురుమ సంఘం అధ్యక్షుడు చిట్కూరి సతీశ్, వెటర్నరీ అసిస్టెంట్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరు తుది జాబితా విడుదల

- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ అర్బన్: ఓటరు తుది జాబితాను ఎన్నికల సంఘం బుధవారం విడుదల చేసిందని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో కరీంనగర్ నియోజకవర్గ ఓటరు జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఫొటో ఓటర్ల తుది జాబితాతో ఎన్నికలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో మొత్తం 3,41,913 మంది ఓటర్లున్నారని, ఎన్ఆర్ఏ ఓటర్లు 78, సర్వీస్ ఓటర్లు 101, థర్డ్‌జెండర్ 44 మంది ఉన్నారని వివరించారు. కరీంనగర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కుందారపు మహేశ్వర్, సత్తినేని శ్రీనివాస్(బీఆర్ఎస్), సంపత్‌రావు(బీజేపీ), మడుపు మోహనచారి(కాంగ్రెస్), కల్యాడపు ఆగయ్య(టీడీపీ), వాసుదేవరెడ్డి(సీపీఐ,ఎం), అబ్బాస్ సమి(ఏఐఎంఐఎం), ఏఆర్వోలు కరీంనగర్ అర్బన్, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ తహసీల్దార్లు వుయ్యాల రమేశ్, ఎస్.రాజేశ్, పి.నవీన్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి పాల్గొన్నారు.

‘బియ్యం దందాలో అధికార పార్టీ నేతల హస్తం’



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

- కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: తమిళనాడుకు బియ్యం అమ్మకం వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉందని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన వడ్లను మరాడించి మిల్లర్లు అమ్ముకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయని, ప్రైవేటుగా రైతుల వద్ద కొనుగోలు చేసినట్టు చెక్కుల వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఎనిమిదేళ్లుగా రేషన్ బియ్యం రీసైక్లింగ్ జరుగుతూనే ఉందని, ఈ దందా వల్ల కొంత మంది కోట్లకు పడగలెత్తారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వడం వల్లే అభివృద్ధికి నిధులు వస్తున్నాయని అధికార పార్టీ నేతలు చెప్పలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు సమద్‌నవాబ్, శ్రవణ్‌నాయక్, దన్నసింగ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, లయక్, పొరండ్ల రమేశ్, జీడి రమేశ్, షబానామహమ్మద్, ఊరడి లత, ముల్కల కవిత, నెల్లి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వర్కర్స్ టు ఓనర్ పథకం అమలుచేయాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో చేనేత జౌళి శాఖ అడిషనల్ డైరెక్టర్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

కరీంనగర్: రాజన్న సిరిసిల్ల తరహాలో జిల్లాలోని పవర్లూమ్ కార్మికులందరికీ వర్కర్స్ టు ఓనర్ పథకం అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం చేనేత జౌళి శాఖ అడిషనల్ డైరెక్టర్ సంపత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పునూటి శ్రీనివాస్, గుడికందుల సత్యం మాట్లాడుతూ, పవర్‌లూమ్ కార్మికులకు ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఒక్కో కార్మికునికి నాలుగు పవర్లూమ్ సాంచెలు మంజూరు చేసి, షెడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. అర్హులకు డబల్ బెడ్రూం ఇళ్లు, దళితబంధు తరహాలో నేతన్న బంధు ఇవ్వాలని పేర్కొన్నారు. ఆర్థికంగా చితికిపోయిన కార్మికులు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వం ప్రోత్సహించాలని, 500 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, 50 ఏళ్లు పైబడిన కార్మికులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ చామనపల్లి అధ్యక్షుడు దూడం గంగాధర్, గర్షకుర్తి అధ్యక్షుడు గడ్డం నారాయణ, నాయకులు కొండబత్తుల స్వామి, గుజ్జేటి శ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహదేవ్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

కరీంనగర్‌కల్చరల్: మహదేవ్ సేవా ఫౌండేషన్ కరీంనగర్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్సారార్ కాలేజ్ గ్రౌండ్‌లో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురికి బీపీ, షుగర్ తదదితర పరీక్షలు చేశారరీ కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ పురేల శ్రీనేశ్, ప్రధాన కార్యదర్శి మామిడాల సుమంత్, వడ్లకొండ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ ప్రారంభం

- కొత్తపల్లి మండలానికి 20,409 గాను 14,414 చీరల కేటాయింపు
- లబ్ధిదారులకు అందజేసిన మున్సిపల్ చైర్మన్ రాజు



కొత్తపల్లిలో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు, కౌన్సిలర్లు తదితరులు

కొత్తపల్లి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఆడపడుచులు కొత్త బట్టలతో జరుపుకోవాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం చీరల పంపిణీకి శ్రీకారం చుట్టింది. అయితే ప్రతి ఏడాదిలాగే ఈసారి సైతం తహసీల్దార్ కార్యాలయాల ద్వారా ఆయా గ్రామాల్లోని రేషన్ దుకాణాలకు సరఫరా జరుగుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కోడ్ కూయకముందే మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో కొత్తపల్లి పట్టణంలో చీరల పంపిణీ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. మండలంలోని 8 గ్రామాలతో పాటు కొత్తపల్లి పట్టణానికి అందజేసే బతుకమ్మ చీరల స్టాక్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నాయి. వీటిని ఆయా గ్రామాల్లోని రేషన్ దుకాణాలకు సరఫరా ప్రక్రియ కొనసాగుతోంది. కొత్తపల్లి మండలంలోని 20,409 మంది లబ్ధిదారులకు చీరలు రావల్సి ఉండగా ప్రస్తుతం 14,414 చీరలు కేటాయించారు. కొత్తపల్లి పట్టణానికి 3,041, రేకుర్తి 1,893, సీతారాంపూర్ 680, మల్కాపూర్, లక్ష్మీపూర్ 1,114, చింతకుంట 2,600, కమాన్‌పూర్ 711, ఎలగందుల 1,215, ఆసిఫ్‌నగర్ 1,553, బద్దిపల్లి 375, నాగులమల్యాల 810, ఖాజీపూర్‌కు 422 చీరలు వచ్చాయి. అలాగే మిగిలిన లబ్ధిదారులకు సైతం త్వరలోనే చీరలు పంపిణీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి పట్టణంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు ప్రారంభించారు. కమిషనర్ కట్ల వేణుమాధవ్, కౌన్సిలర్లు వాసాల రమేశ్, గున్నాల విజయ, గండు రాంబాబు, సత్యనారాయణరెడ్డి, వేముల కవిత, కోఆప్షన్ సభ్యులు ఫక్రుద్దీన్, ప్రభాకర్, షహనాజ్, మెప్మా అధికారి మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఈఆర్‌ఎస్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు

కొత్తపల్లి: దివ్యాంగులకు ప్రభుత్వం అందజేసే ఎకనామిక్ రిహాబిలిటేషన్ స్కీం (ఈఆర్ఎస్) కింద వంద శాతం సబ్సిడీపై మంజూరైన రూ.50వేల చెక్కును కొత్తపల్లి పట్టణానికి చెందిన చిగుళ్ల నాగరాజుకు చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉమారాణి, కమిషనర్ కట్ల వేణుమాధవ్‌తో కలిసి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు బుధవారం అందజేశారు. మీసేవ కేంద్రంతో ఉపాధి పొందుతున్న లబ్దిదారుడు నాగరాజు కంప్యూటర్, ప్రింటర్ కొనుగోలు చేసుకునేందుకు చెక్కును అందజేసినట్లు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వాసాల రమేశ్, వేముల కవిత, చింతల సత్యనారాయణరెడ్డి, నాయకులు స్వర్గం నరసయ్య, చంద్రశేఖర్, రమేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

8న ‘హోమ్ మేకర్’ కవితా సంపుటి ఆవిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో కవి నాంపల్లి సుజాత రచించిన ‘హోమ్ మేకర్’ కవిత సంపుటిని ఈ నెల 8న కరీంనగర్ ఫిల్మ్ భవన్‌లో ఉదయం 10 గంటలకు ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత ఆవిష్కరించనున్నట్లు తెరవే అధ్యక్ష, కార్యదర్శులు కందుకూరి అంజయ్య, సీవీ కుమార్ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, కవులు కొమర్రాజు రాజ్యలక్ష్మి, గాజోజు నాగభూషణం, బూర్ల వెంకటేశ్వర్లు, తోట నిర్మలారాణి, ఏదునూరి రాజేశ్వరి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

చిత్ర కథ: క్రీడాప్రాంగణంలో ట్రాన్స్‌ఫార్మర్



కరీంనగర్ మండలం చేగుర్తి క్రీడాప్రాంగణంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏడాది క్రితం తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసింది. అయితే క్రీడాప్రాంగణంలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండటంతో క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలని పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకర విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– కరీంనగర్‌రూరల్

ఒకే విడతలో రైతులకు రుణమాఫీ చేయాలి

విద్యానగర్: రైతులకు రూ.లక్ష రుణమాఫీని ఒకే విడతలో చేయాలని మన ఆదర్శ రైతు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ బండ కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు కొంత మంది రైతులకే రుణమాఫీ జరిగిందని వివరించారు. మిగతావారికీ కూడా వెంటనే వర్తింపజేయాలని పేర్కొన్నారు. రైతుబంధు కంటే రైతులకు ప్రత్యక్షంగా ఉపయోగపడే ఎరువులు, పరికరాలను తక్కువ ధరల్లో అందించాలని కోరారు. పంట ఉత్పత్తులకు మద్దతు ధర పెంచాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం కో-కన్వీనర్ చిట్కూరి శ్రీనివాస్, నాయకులు చింతల శ్రీనివాస్‌రెడ్డి, పెద్ది బీరయ్య, జేరిపోతుల వాసు, కూకట్ల మల్లేశం, చిగుర్ల అశోక్, గుంటి అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.